క్లుప్తంగా

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీర హనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, ఇంద్రారెడ్డి, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనుపాండే, శ్రీరాంపాండే, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌనమ్మ జాతర ప్రారంభం

తుంగతుర్తి : మండల కేంద్రంలో యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ సౌనమ్మ అమ్మవారి జాతర నేటి నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. సోమవారం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. మంగళవారం చంద్రపట్నం, యాటపోతులను బలి ఇవ్వనున్నారు. బుధవారం నెలవారం నిర్వహించడంతో జాతర ముగుస్తుంది. ఈ మేరకు యాదవులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అండ



చెక్కులు పంపిణీ చేస్తున్న సర్వోత్తంరెడ్డి

అర్వపల్లి : సీఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాసర్లపహాడ్, కొమ్మాల, జాజిరెడ్డిగూడెం తదితర గ్రామాలకు చెందిన మంచాల శేషమ్మకు రూ.60వేలు, ఆకుల అనసూయకు రూ.60వేలు, దాసరి శివానికి రూ.29500, కర్నాటి సువర్ణకు రూ.34వేలు, నర్సింగ రమేష్‌కు రూ.14వేలు, సాయిని శేఖర్‌కు రూ.60వేల చొప్పున సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు పెసర సతీష్‌రెడ్డి, బాస్పోలు శ్రీను, ఉపేందర్, అమీన్, గంట జయంత్, శ్రీను, యుగేందర్, ఖాజ, అనిల్, సందీప్, రమావత్ శేఖర్, మహేష్, ఉపేందర్, రమేష్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రాభిషేకం



ఉండ్రుగొండలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

చివ్వెంల : వైశాఖమాస శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో వెలిసిన శ్రీఉమామహేశ్వర స్వామి వారికి ఆదివారం వైభవంగా రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు బ్రహ్మశ్రీ పరిమి శివరామ శర్మ, మంత్రోచ్చరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యకమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు లతీఫ్ మృతి

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు చిగుర్ల లతీఫ్ (80) అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు లతీఫ్ మృతదేహానికి నివాళులర్పించి పేదల కోసం ఆయన చేసిన పోరాటాన్ని, సేవలను గుర్తుచేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, కునుకుంట్ల సైదులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- గ్రామాల్లో పడకేసిన పాలన
- రోడ్లపై మురుగు, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



లింగాలలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగునీరు

పెన్‌పహాడ్ : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో మురుగు నీటి ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతుంది. ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి. మండలంలోని లింగాల గ్రామంలోని పలు వీధుల్లో మురుగు నీరు ప్రధాన రహదారిలో ప్రవహిస్తుంది. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, నీరు నిలుస్తుండడంతో దుర్వాసన వస్తోందని సమీప ఇళ్ల ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో మురుగు నీరు చేరడంతో ప్రజలు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. తీవ్ర దుర్గంధం వస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. రానున్న వర్షాకాలంలో డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో మురుగునీరు ఎటు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఈ వార్డుల్లో వీధులన్నీ మురుగు ప్రవహిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి

వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్యం లోపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. వీధుల్లో రోడ్ల పై మురుగునీరు పారకుండా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి. రోడ్లపై పారుతున్న మురుగునీరు తొలగించి సమస్య పరిష్కరించాలి. మురుగునీరు వీధుల వెంబడి పారకుండా చర్యలు తీసుకోవాలి.

– సైదమ్మ లింగాల

అధికారులు పట్టించుకోవడం లేదు

మురుగు కాల్వల్లో పూడిక నిండి ఉంది. దుర్వాసనతో ఇబ్బందిగా ఉంటుంది. పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. మురుగు కాల్వలను పునఃనిర్మాణం చేపట్టి మురుగునీరు రోడ్డుపై రాకుండా చర్యలు తీసుకోవాలి.

– వెంకన్న లింగాల

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు కృషి

గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగునకు కృషి చేస్తున్నాం. పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నాం. కొన్ని చోట్ల డ్రెయినేజీ నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

అటవీ సంపదను దోచి పెడుతున్న మోదీ

సూర్యాపేట అర్బన్ : ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో మోదీ, అమిత్‌షాల ప్రభుత్వం అటవీ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టేందుకు అటవీ సంపదకు రక్షణగా ఉన్న ఆదివాసీలను, మావోయిస్టులను హత్యలు చేస్తుందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు కే.గోవర్ధన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కశ్మీర్ సమస్య పరిష్కారం కానంత కాలం పాకిస్తాన్, భారతదేశాల మధ్యన సంఘర్షణ యుద్ధాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. నక్సలిజాన్ని నిర్మూలించడానికి గత ప్రభుత్వాల నుంచి నేటి మోదీ వరకు సల్వాజుడం, గ్రీన్‌హంట్, ఆపరేషన్ కగార్‌ల పేర్లతో ఆదివాసీలను మావోయిస్టులను హత్య చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి నుంచి నేటి వరకు 550పైగా హత్యలు చేశారని, అటవీ సంపదపై ఆదివాసులకు హక్కు లేకుండా కార్పొరేట్లకు అప్పగించడానికి యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని, తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ బద్ధంగా కాకుండా మోదీ ప్రభుత్వం నేర పూరిత పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. దీనిపై ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యావంతుల, మేధావులు ఐక్యంగా వ్యతిరేకించాలని కోరారు. పార్టీ జిలా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, కె.ధర్మార్జున్, భద్రయ్య, రంగారెడ్డి, కలక్కా, నాగయ్య, సైదులు, లక్ష్మయ్య, శంకర్, కిరణ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : పట్టణంలో ది సూర్యాపేట ఇంజనీరింగ్–ఎలక్ట్రికల్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాబ్యాంకు ఎండీ పెద్దిరెడ్డి గణేష్ పాల్గొని మాట్లాడారు. సభ్యులు అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని, అందరూ ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మాదా శాంతయ్య, గౌరవ సలహాదారులుగా చీదేటి సత్తిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా కోదాటి వెంకటరాములు, సీతా సూరి, ఉపాధ్యక్షులుగా పల్లా పుల్లారెడ్డి, అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తాడూరి శేఖర్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా కారింగుల శేఖర్‌గౌడ్, రాంసింగ్, కోశాధికారి బహురోజు నాగేశ్వరాచారి, కార్యనిర్వాహక కార్యదర్శులు మారోజు వెంకటరమణ చారి, ఎండీ.కలీమ్, మామిడి రాము,ప్రచార కార్యదర్శులుగా మారోతు శరత్‌చంద్ర, యరకల శ్రీనివాస్‌గౌడ్, బాణోతు రాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రామడుగు ధర్మారావు, గోపయ్య, వుప్పల సూర్యనారాయణ, శ్రవణ్‌కుమార్, నల్లపాటి శ్రీధర్, పుల్లయ్య, మారోజు యాదయ్య పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావడానికే 'మన్ కీ బాత్'



నాగారంబంగ్లాలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు

నాగారం : ప్రధాని నరేంద్రమోదీ ప్రజలతో మమేకమై తన మనసులోని భావాలను వ్యక్తీకరించడానికే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని చేపట్టారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాన్ కీ బాత్ జిల్లా ఇన్‌చార్జ్ గజ్జల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామంలో బీజేపీ నాయకులతో కలిసి మన్ కీ బాత్ 265వ ఎపిసోడ్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతినెలా చివరి ఆదివారం రోజున మన్ కీ బాత్ కార్యక్రమం ప్రసారమవుతుందని, 8ఏళ్లలో ఈ ప్రోగ్రాం 100కోట్ల మందికి చేరువైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని, రానున్న రోజుల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుంభం కరుణాకర్, మండల కన్వీనర్ కొత్తోజు ఎల్లాచారి, పడమటింటి గిరిప్రసాద్, రాములు, సుజాత, భాగ్యమ్మ, శిరీష, సింధు, యాదగిరి, లింగయ్య ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని దుబ్బతండాకు చెందిన వృద్ధ దంపతులు జాటోతు తావూరియా – బుజ్జమ్మకు శనివారం పోలీసులు ఆర్థిక సాయం అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రాజశేఖర్, మండల ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ వారిని పరామర్శించి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు.

సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలుచేయాలి

మునగాల: రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని, లేకుంటే బీసీ సంఘాల ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్టుదుకాణాలకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సూర్యాపేట : సమ్మేళనంలో పాల్గొన్న పోలుమల్ల పూర్వ విద్యార్థులు



తిరుమలగిరి : సమ్మేళనంలో పాల్గొన్న తిరుమలగిరి పాఠశాల విద్యార్థులు

సూర్యాపేట : మద్దిరాల మండలంలోని పోలుమల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000పదోతరగతి విద్యార్థుల ఆదివారం సూర్యాపేట పట్టణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా 25సంవత్సరాల తర్వాత ఒకచోట కలిసి పాతరోజులు గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జన్మియా, కృష్ణయ్య, మల్లారెడ్డి, వీరారెడ్డి, శ్రీను, దినారాణి, రాఘవరెడ్డి, మంజుల, హేమలత, శకుంతల, సురాంభ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాల 2004–2005పదోతరగతి విద్యార్థులు ఆదివారం స్థానికంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. వారు 20ఏళ్ల తరువాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా సరదాగా అంతా కలిసి గడిపారు. అనంతరం ఆనాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు కుంభం రాంమూర్తి, రత్నం లక్ష్మాజి, దబ్బేటి యాదగిరి, భాషామియ, జగన్, రాంప్రసాద్, దేవయ్య, సుధాకర్, కృష్ణ, సైదయ్య, కిరణ్, వెంకన్న, శ్రీను, పూర్వ విద్యార్థులు నిడుమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్, వజ్జె సైదులు, పందిరి ఉపేందర్, కె.శ్రీను, జనార్దన్, రవి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–2003 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గత స్మృతులను విద్యార్థులు, ఉపాధ్యాయులు స్మరించుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీరామ్, విద్యార్థులు కుమారస్వామి, రమేష్, వీరమల్లు, రఘు, లింగయ్య, రమేష్ గౌడ్, సంపత్, పురుషోత్తం, బద్రి, కుమార్, శేఖర్, విజయ్, రేణుక, మల్లయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–20 చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు కళారాణి, గాలి మురళీ, వెంకటరత్నం, అమీర్‌ఖాన్, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంతయ్య, పూర్వ విద్యార్థులు శోభన్ బాబు, రవి, శీను, వెంకటేష్, రాము, ఇంద్రారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : సమ్మేళనంలో పాల్గొన్న విజ్ఞాన్ విద్యార్థులు



ఆత్మకూర్ (ఎస్) : సమ్మేళనంలో పాల్గొన్న నెమ్మికల్ విద్యార్థులు

లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

సూర్యాపేట అర్బన్ : భారత రాజ్యాంగాన్ని, లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన పార్టీ పట్టణ నాలుగో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలు, దళితులు, బహుజనులు నేటికి రాజ్యాంగ హక్కులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా భావాలను వెలిబుచ్చితే అర్బన్ నక్సలైట్లు, దేశ ద్రోహి అంటున్నారని, ప్రభుత్వం దేశ ప్రజలతో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయి తీవ్ర అలజడులు, పోరాటాలు నెలకొంటున్నాయని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాదాన్ని మట్టి పెట్టడాన్ని సీపీఐ హర్షిస్తుందన్నారు. బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యులు కేవీఎల్, అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని నాగభూషణం, బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబు, దొరపల్లి శంకర్, రాము, రాజారాం, రేగటి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏబీఏపీ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఇస్లావత్ నగేష్

సూర్యాపేట : అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) సూర్యాపేట జిల్లా శాఖ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఏబీఏపీ జోనల్ సెక్రటరీ ఇస్లావత్ నగేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంస్థ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ ద్వారా శబరిమల దగ్గర నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలతో విరాళాలు అందించేందుకు సంస్థ ద్వారా కృషి చేయాలన్నారు. జులై 19, 20 తేదీల్లో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశానికి జిల్లా నుంచి ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రంగు ముత్యం రాజు, ప్రధాన కార్యదర్శి కొత్తగట్టు యాదగిరి, కోశాధికారి మాశెట్టి నరేష్, శంకర్ చౌదరి, భూపతి శ్రీనివాస్ గౌడ్, తన్నీర్ వాసుదేవ్, రాఘవ, సత్యనారాయణ, శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మద్దిరాల : మండల కేంద్రంలో బోనాల పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వానాకాలం పంటలు ప్రారంభమయ్యే ముందు పంటలు సమృద్ధిగా పండాలని గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలతో వచ్చి ముత్యాలమ్మ అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న తూముల భుజంగరావు

పెన్‌పహాడ్ : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మేగ్యాతండా ఆవాసం గంగ్లీతండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గుండు వెంకన్న గోపాల్, లింగయ్య, కోక హుస్సేన్, లెనిన్, వీరునాయక్, తాటి నాగరాజు పాల్గొన్నారు.

కోలాట పోటీల విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకుడు రాంబాబు

మునగాల: మండలంలోని నేలమర్రిలో ఆదివారం గ్రామ కళాకారుల ఆధ్వర్యంలో నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లా స్థాయిలో నిర్వహించిన కోలాట పోటీల్లో విజేతలకు నిర్వాహకుడు బచ్చలకూరి రాంబాబు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మేళ్లచెరువు మండలం దుబ్బతండాకు చెందిన టీం గెలుచుకోగా, ద్వితీయ బహుమతి సూర్యాపేట మండలం రాజునాయిక్ తండా, తృతీయ బహుమతి నేలమర్రికి చెందిన రేలా కోలాట బృందం గెలుచుకున్నట్లు రాంబాబు తెలిపారు.

ముగిసిన వృత్యంతర శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మునగాల: మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న పునశ్చరణ వృత్యంతర శిక్షణ ఆదివారం ముగిసింది. మూడవ తరగతి పూర్తయ్యేనాటికి విద్యార్థులు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలను గణితంలో చేయడం వంటి గుణాత్మక విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలను అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆగస్టు 15నాటికి ప్రతి విద్యార్థిలో కనీస సామర్థ్యాలను అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు కోరారు. శిక్షణకు సహకరించిన ఎమ్మార్పీ, సీఆర్పీలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈఓ ధన్యవాదాలు తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేత

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని దుబ్బతండాకు చెందిన వృద్ధ దంపతులు జాటోతు తావూరియా – బుజ్జమ్మకు శనివారం పోలీసులు ఆర్థిక సాయం అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రాజశేఖర్, మండల ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ వారిని పరామర్శించి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు.

నిరుపయోగంగా అంబేద్కర్ భవనం


- ఎస్‌సీడీడీ నిధులు రూ.కోటితో నిర్మాణం
- వసతులు లేకపోవడంతో సమావేశాలకు ఆసక్తి చూపని నాయకులు



తుంగతుర్తిలో నిర్మించిన అంబేద్కర్ భవనం

తుంగతుర్తి : మండల కేంద్రంలో దళితులు సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి గత ప్రభుత్వం హయాంలో అంబేద్కర్ భవనం నిర్మించారు. భవనం నిర్మించి మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. 2020లో ఎస్‌సీడీడీ నిధులు రూ.కోటితో భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం 2023లో భవనం నిర్మాణం పూర్తయ్యింది. అనంతరం ఈ భవనాన్ని గత ఏడాది మార్చి–16న ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. కానీ ఆ భవనం మండల కేంద్రానికి 2 కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో ప్రజలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడుగా ఈ భవనానికి చుట్టు ప్రహరి లేకపోవడం, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించలేదు. ప్రస్తుత ప్రభుత్వం అంబేద్కర్ భవనం చుట్టూ ప్రహరి నిర్మించి, మౌలిక వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



మండల కేంద్రంలో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. నిధులు కేటాయించి భవనానికి చుట్టూ ప్రహరి నిర్మించి, నీటి, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. వసతులు లేకపోవడంతో అంబేద్కర్ భవనం నిరుపయోగంగా ఉంటుంది.

– మల్లేపాక సాయిబాబా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి